క్లుప్తంగా

మున్యానాయక్ తండా సర్పంచ్‌కు సతీవియోగం



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని మున్యానాయక్ తండా సర్పంచ్ బానోతు బీకారి భార్య పద్మ (28) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం సందర్శించి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, జెడ్పీటీసీ భుక్యా సంజీవ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

నాగారం : ఫీజుల పేరుతో విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్న ఫణిగిరిలోని మేరీమదర్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఐఐటీ పేరుతో, స్పెషల్ ఫీజులు, టర్మ్‌ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, బస్సు, ల్యాబ్, కంప్యూటర్, షూ, బెల్ట్, యూనిఫాం, బ్యాడ్జిల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజు చెల్లించని విద్యార్థులను బయట నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కేవలం నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థుల నుంచే రూ.25వేలకు పైగా వసూలు చేస్తున్నారని, టెన్త్ విద్యార్థుల నుంచి రూ.50వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మేరీమదర్ పాఠశాలపై ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా నేటికీ పాఠశాలను సందర్శించని విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు పీడీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జాతరలో విక్రయాలకు వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు

చివ్వెంల : మండల పరిధిలోని పులితండా (గుడితండా) గ్రామంలో ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరిగే గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ చాంపులాల్ స్వామి జాతరకు సోమవారం అధికారులు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిల విక్రయ వేలాన్ని రూ.64 వేలకు సూర్యాపేటకు చెందిన శ్రీనివాస్ కైవసం చేసుకున్నారు. అలాగే బొంగులు, పేలాల విక్రయ వేలాన్ని రూ.29 వేలకు సూర్యాపేటకు చెందిన నాగరాజు, కొబ్బరి కాయల వేలాన్ని రూ.36 వేలకు సూర్యాపేటకు చెందిన నాగేష్ కైవసం చేసుకున్నారు. తలనీలాల సేకరణకు సరైన ధర రాకపోవడంతో అధికారులు ఈనెల 15కు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ టి.గోపి, సర్పంచ్ ధరావతు వీరన్న, పంచాయతీ కార్యదర్శులు అశోక్, చలమయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న జ్ఞానసుందర్

అర్వపల్లి : కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో టీపీసీసీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, తుంగతుర్తి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.యల్లయ్య, ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు చెరుకు విజయ్‌కుమార్, సాయి, వంశీ, శ్రీను, సంతు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషిచేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి అశ్రితారెడ్డి

నూతనకల్ : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి అన్నారు. సోమవారం చిల్పకుంట్ల గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది కిరణ్, ప్రసాద్, మాణిక్యం, సీతారాంరెడ్డి, ఆశవర్కర్లు భారతమ్మ, పద్మ, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పని భారమాయే.. జీతం రాదాయే

- పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కార్మికులు
- పనిభారం పెంచుతున్నారని ఆవేదన



ఆత్మకూరులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)

ఆత్మకూర్ (ఎస్) : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఇళ్ల బిల్లుల వసూళ్లు, చెత్త సేకరణ, మురుగుకాల్వలు శుభ్ర పరచడం, గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సరఫరా తదితర పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను నియమించింది. మండల వ్యాప్తంగా 30 గ్రామ పంచాయతీలకు గానూ 114 మంది పనిచేస్తుండగా వారికి ఒక్కొక్కరికీ నెలకు రూ.8500 చొప్పున జీతం అందాలి. కానీ గత 4 నెలలుగా మండల వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందడంలేదు. దీంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వారికి పనిభారం కూడా పెరుగుతోంది. గ్రామంలో వీధులు ఊడ్చడం, మురుగు కాల్వలు తీయడం, చెత్త సేకరించడం, పైపులైన్ లీకేజీలు సరిచేయడం, గ్రామంలో నీటి సరఫరా, బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపర్చడం వంటి అన్ని పనులు చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. పని ఒత్తిడి ఉన్నప్పటికీ నెలనెలా జీతాలు ఇస్తే బాగుండునని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతినెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి నెలా జీతం ఇవ్వాలి



తక్కువ జీతానికి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందడంలేదు. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. భార్య, పిల్లల్ని సాధుకునే పరిస్థితిలేదు. పని ఎక్కువ, జీతం తక్కువ. అధికారులు స్పందించి మాకు జీతాలు పెంచడంతో పాటు ప్రతి నెలా జీతం ఇవ్వాలి.

– బండారు సైదులు, పారిశుద్ధ్య కార్మికుల మండల అధ్యక్షుడు

పనిభారంతో తీవ్ర ఇబ్బంది



గ్రామ పంచాయతీల్లో ప్రతి పనికి పారిశుద్ధ్య కార్మికులనే ఉపయోగిస్తున్నారు. దీంతో వారు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గించాలి. పారిశుద్ధ్య కార్మికులను పెంచాలి. ప్రతి నెలా జీతాలు అందించడంతోపాటు వేతనాలను రూ. 15 వేలకు పెంచాలి.

– బొడ్డు పీటర్, పారిశుద్ధ్య కార్మికుల మండల కార్యదర్శి

భావితరాలకు స్ఫూర్తి.. కవయిత్రి మొల్ల



నివాళులర్పిస్తున్న నాయకులు, ట్రాఫిక్ ఎస్‌ఐ

భానుపురి : చదువు కొద్దిమందికే పరిమితమైన రోజుల్లో ఎంతో వివక్షను ఎదుర్కొని సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని అందరికీ అర్థమయ్యేలా తెలుగులోకి అనువదించిన తొలి మహిళా కవయిత్రి కుమ్మర మొల్ల భావితరాలకు స్ఫూర్తిదాయకమని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాలివాహన భవనంలో కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్, కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఖమ్మంపాటి రేణుబాబు, పట్టణ అధ్యక్షుడు సలిగంటి నాగయ్య, నాయకులు సిరివెళ్ల శబరినాథ్, సలిగంటి వీరేందర్, శ్రీనివాస్, మద్దికుంట్ల చింటు, ప్రభాకర్, నిమ్మనగోటి వెంకన్న, రాంబాబు, మధు, మోహన్, సిరికొండ నాగయ్య, లింగాల గుంశావళి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది పెట్టకుండా హాల్ టికెట్లు ఇవ్వాలి

సూర్యాపేటటౌన్ : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వాలని ఆర్‌వీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చామకూరి మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌వీఎస్‌పీ ఆధ్వర్యంలో డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫీజులు పూర్తి స్థాయిలో చెల్లిస్తేనే హాల్ టికెట్‌లు ఇస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే హాల్ టికెట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తరుణ్, దినేష్, నవీన్, వాసు, గౌతమ్, షరీఫ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సొడమ్మ జాతర



ఆలయంలో కొబ్బరికాయ కొడుతున్న మంత్రి

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలో రెండేళ్లకోసారి నిర్వహించే సొడమ్మ జాతర ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో యాదవులు సంప్రదాయం ప్రకారం పూజలు చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సోమవారం తెల్లవారుజామున బోనాల ప్రదర్శన, అనంతరం బలి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సయ్యద్ ఇస్మాయిల్, జర్నలిస్ట్ నాయకులు కంబాలపల్లి కృష్ణ, గుణగంటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న పటేల్ రమేష్ రెడ్డి

చివ్వెంల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోరి ఎర్ర సూర్యాతండాలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పాలనలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా మారినా రోడ్డు సౌకర్యం, బస్సు సౌకర్యం లేక ప్రజలు కిలోమీటర్ల మేర కాలినడకన నడుస్తున్నారని అన్నారు. తండాల్లో మౌలిక వసతులు లేవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం మోపుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో గోదాల రంగారెడ్డి, నామా ప్రవీణ్, గండికోట లక్ష్మయ్య, వెలుగు వెంకన్న, షఫి ఉల్లా, ఫరూఖ్, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు విరాళం



విరాళం అందజేస్తున్న రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల

నాగారం : నాగారం మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాలలు సోమవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ ఉత్సవాల నిర్వహణ కోసం మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో రూ.50,000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండగాని అంబయ్య, బీఆర్‌ఎస్ నాయకులు చిప్పలపల్లి సోమయ్య, కూరం వెంకన్న, చిప్పలపల్లి రాములు, పాల్వాయి మల్లయ్య, చిప్పలపల్లి మల్లేష్, పాల్వాయి ఎల్లయ్య, వినయ్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వట్టిఖమ్మంపహాడ్‌లో బొడ్రాయి పండుగ



ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లో సోమవారం బొడ్రాయి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయి వద్ద శ్రీపోతురాజు స్వామికి దున్నపోతు, యాటపోతులను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో బలిహరణ కార్యక్రమం నిర్వహించి, పొలిమేర నుంచి వాహనాలను అరగంట సేపు నిలిపివేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, ఎంపీటీసీ సభ్యుడు వేములపల్లి వాసుదేవరావు, సర్పంచ్ కలకొండ కరుణ శ్యాంసన్, మాజీ సర్పంచ్‌లు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, గోగుల యల్లమ్మ, గుర్వయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, నాయకులు ఎల్కపల్లి భిక్షం, జంపాల వెంకటేశ్వర్లు, ఎల్కపల్లి వెంకన్న, ఎండీ మునీర్ ఖాన్, పబ్బు సైదులు, కొండ వెంకన్న, మున్న సైదులు, ప్రగడ నర్సింహారావు, మట్టపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక, చైర్మన్ సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్ అన్నారు. సోమవారం కోమటిపల్లి గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సర్పంచ్ జాల నర్సయ్య, ఉపసర్పంచ్ బాసాని గౌరమ్మ, గ్రామశాఖ అధ్యక్షుడు గిలకత్తుల వీరయ్య, పంచాయతీ కార్యదర్శి ఫర్హానబేగం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

మద్దిరాల : పోలుమల్ల హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుమల, సీఆర్పీ నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : రామన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ ఎంసీ చైర్మన్ చింత వెంకన్న, హెచ్‌ఎం చిత్తలూరి యాదగిరి, ఉపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.



మద్దిరాల : పోలుమల్ల ప్రభుత్వ పాఠశాలలో స్వపరిపాలన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



సూర్యాపేట రూరల్ : రామన్నగూడెంలో..

గ్రామపంచాయతీ ఉద్యోగుల నిరసన



అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ ఉద్యోగులు



నాగారంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

అర్వపల్లి : గ్రామపంచాయతీ ఉద్యోగులకు నెలనెలా వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయపల్లి వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలో జీతాలు సరిగా రావడం లేదని గ్రామ పంచాయతీ ఉద్యోగి బాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని రూ. 25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఊట్కూరి భీముడు, కుంభం రామ్మూర్తి, బోయపల్లి జలేందర్, సైదుల సతీష్, రింగు లక్ష్మి పాల్గొన్నారు.

నాగారం : కామారెడ్డి జిల్లా బీబీపేట గ్రామ పంచాయతీ సిబ్బంది కొంగరి బాబు వేతనాలు రావడం లేదని మానస్తాపం చెంది గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆత్మహత్యకు పాల్పడటంతో దీనిని నిరసిస్తూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఎండీ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుశలవచారి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కొంగరి బాబు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను విడుదల చేయాలని, రూ.10లక్షల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బంది వేతనాలను రూ.16వేలకు పెంచాలని, మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంకోజు నాగాచారి, వీరాచారి, సతీష్, మల్లయ్య, నాగయ్య, అశోక్, రమేష్, పరశురాములు, వెంకన్న, సరిత, సోమక్క, మారమ్మ, సుజాత, ముత్తయ్య, వీరన్న, సోమన్న, అంజయ్య,యాకయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో పండుగలకు ఆదరణ



పోతరాజు జాతరలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్

సూర్యాపేట రూరల్ : తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో గ్రామీణ పండుగలకు ఆదరణ లభించిందని డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలో పోతరాజు జాతరలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ముదిరెడ్డి సంతోష్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బెల్లంకొండ సైదులు, బయ్య సైదులు, నాగరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో 2003–2004 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు బోధించిన గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంబులింగం, వినోద్‌కుమార్, యాకయ్య, నయిమోద్దీన్, సంధ్యారాణి, పూర్ణచందర్, సుదర్శన్, హెచ్‌ఎం శ్రీనివాస్, పూర్వవిద్యార్థులు బోయిని లింగమల్లు, ఆకుల యుగేందర్, మద్దెల నరేందర్, గంట వెంకన్న, బండారి రమేష్, అమరేందర్, నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి



ఆన్‌లైన్ నమోదును ప్రారంభిస్తున్న సంకినేని

ఆత్మకూరు (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేదలు ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరితే రూ.5లక్షల ఉచిత ఆరోగ్య బీమా ఉంటుందన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో వారు ప్రభుత్వ పథకాల ఫలాలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, మన్మథరెడ్డి, సంధ్యాల సైదులు, పాటి కరుణాకర్‌రెడ్డి, సకినాల వెంకన్న, మాధవరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తిరుమలగిరి : మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఎంట్రెన్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన పోతరాజు సుధీర్ సోమవారం తన సొంత ఖర్చులతో పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కందుకూరి అంజయ్య, ఆనంద్‌భాస్కర్, శక్రు, నరేష్, అజయ్, క్రాంతి, మల్లేష్, నవీన్, వెంకన్న, అమరేందర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మద్దిరాల : ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బాలరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో ని ర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వికాస్ పాటిల్, పశువైద్యాధికారి అసిఫా, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, ఎంపీఓ రాజేష్ పాల్గొన్నారు.

ఆలయంలో పుష్పయాగం

నాగారం : మండల పరిధిలోని శ్రీసీతా రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, అర్చకులు మాధవాచార్యులు, కూరేషం సంతోష్‌కుమార్, దుత్త, సాయి, ధర్మకర్తలు మిరప అంజయ్య, నల్ల రమేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

సూర్యాపేట రూరల్ : కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు అన్నారు. సోమవారం రత్నపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్టు వినోద్, వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం కొనసాగించాలి

దురాజ్‌పల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మూడేళ్లకు ఒక్కసారి కాకుండా నిరంతరం కొనసాగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాలు జరగట్లేదని, తక్షణమే అక్కడ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

తిరుమలగిరి : కళాశాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని రాఘవేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నెల్లుట్ల రాజు, కరస్పాండెంట్ తీగుళ్ల శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు వీరన్న, సైదులు, ప్రవీణ్, సురేందర్, కరుణ, గీత, వేమన పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

తిరుమలగిరి : తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి శత జయంతి ఉత్సవాల కరపత్రాలను తిరుమలగిరిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య మాట్లాడారు. మార్చి 15న దాచారంలో బీఎన్.రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, కందుకూరి సోమయ్య, కడెం మల్లయ్య, తేరాల యాదగిరి, ఉప్పలయ్య, పత్తెపురం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి వేడుక



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్

తిరుమలగిరి : మన పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో సోమవారం లింగమంతుల స్వామి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, తిరుమలగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, గోపాల్‌రెడ్డి, లింగన్న, యాదగిరి, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలుకు ఎమ్మెల్యే నివాళి

అర్వపల్లి : అర్వపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ నాయకురాలు కడారి బుచ్చమ్మకు సోమవారం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, కాపా వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ ఖమ్మంపాటి నరేష్, బైరబోయిన రామలింగయ్య, శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, బొడ్డు రామలింగయ్య పాల్గొన్నారు.